# ద్వైతం

"వీటితో వేగలేక చచ్చిపోతున్నానండీ" అంది శ్రీమతి.

"తెలుగులో యం.ఏ. చదివావు. భాషాదోషాలు లేకుండా మాట్లాడలేవా? మన ఇద్దరు పిల్ల రాక్షసుల గురించేగా అంటున్నావు. వీటితో అనే పదం వాడకూడదు. వీళ్ళతో వేగలేక చచ్చిపోతున్నానండీ అనాలి. తెల్సిందా?"

"అయ్యో ఖర్మ . . . మీ లెక్చర్లు కాలేజీలో మీ స్టూడెంట్స్‌కి చెప్పుకోండి. నేను మాట్లాడేది పిల్లల గురించి కాదు . . . పావురాళ్ళ గురించి".

"పిల్లలూ, పావురాళ్ళు ఒకటేనోయ్. నాజూకు . . . చాలా ముద్దుగా చూసుకోవాలి".

"చాల్లెండి సంబడం . . . సరదా కాదు. చాలా సీరియస్‌గా చెప్తున్నా. యిల్లంతా రోజూ కడగలేక చస్తున్నా".

"పని మనిషి ఉంది కదా"

"అదైనా మనిషే . . . ఎంతని చేస్తుందీ? యింటి చుట్టూతా కాపురాలు పెట్టాయి. వాటి రెట్టల్తో గోడలన్నీ ఖరాబవుతున్నాయి. బంగారం లాంటి యిల్లు . . . వాటి పుణ్యమా అంటూ ఎటు చూసినా పెంటపోగులే. తరిమితే ఎగిరిపోయి, నేను యింట్లోకి రాగానే మరలా వచ్చి కూచుంటున్నాయి".

"ఎవరిళ్ళల్లోకి వాళ్ళు వెళ్ళే అధికారాన్ని మనం ఎలా ప్రశ్నించగలం? నీ యింట్లోకి నువ్వొచ్చినట్లే వాటి యిళ్ళల్లోకి అవి వెళ్తున్నాయి. సింపుల్ లాజిక్. ఆలోచించు".

"జోకులాపండి. డోకులొచ్చేలా ఉన్నాయి. మీకేం ఉదయం కాగానే సుష్టుగా టిఫిన్

లాగించి కాలేజికి ఉడాయిస్తారు. వీటి పీడ ఎలా వదిలించుకోవాలా భగవంతుడా అని రోజంతా ఆలోచించి బుర్ర బద్దలు చేసుకుంటున్నా తెలుసా? వాటి రెట్టల్ని శుభ్రం చేయటం ఒక నరకమైతే అవి చేసే శబ్దాల్ని వినటం మరో నరకం. నాకు పిచ్చి పట్టేట్టుంది".

"అదేంటోయ్ అలా అంటావ్? పావురాళ్ళ కువకువ శబ్దాలు వినసొంపుగా ఉంటాయి కదా!"

"ఆ ఉంటాయి. పగలంతా కాలేజీలో ఉండే మీకేం తెలుస్తుంది? రోజంతా యింట్లో ఉండి వినండి. ఎంత చిరాకనిపిస్తుందో . . . ఓ క్షణమైనా నిశ్శబ్దంగా ఉంటాయేమో చూద్దామంటే . . . వుహూ . . . ససేమిరా. నాకైతే కర్ణకఠోరంగా వినిపిస్తాయి - దూరంగా ఎక్కడికైనా ప్రశాంతమైన ప్రదేశానికి పారిపోవాలనిపిస్తోంది".

"చూడు సుశీ . . . అవి పక్షులైనా మనలాంటి ప్రాణులే. అవీ బతకాలిగా. నువ్వు యింటి చుట్టూతా రకరకాల మొక్కల్ని పెంచి వాటికి చక్కని తోటలో కాపురముంటున్న అనుభూతిని కలిగిస్తున్నావాయె. అవి కువకువల్తో తమ సంతోషాన్ని నీకు తెలియ బరుస్తున్నాయి తెలుసా?"

యింకేదో అనబోయి ఆమె కళ్ళలోని కోపం చూసి ఆగిపోయాను.

"మీకు థ్యాంక్స్ కూడా చెప్తుండాలే . . . పక్షుల భాషని ఔపోసన పట్టారు కదా. నేనీ హింస భరించలేను. ఓ వారం మిద్దెమీదికెళ్ళటం కుదర్లేదు. నిన్న వెళ్ళి చూద్దును కదా రెట్టలన్నీ ఎండిపోయి కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. వాటిని కడిగి శుభ్రం చేసేటప్పటికి నాకూ, పనిమనిషికీ రెక్కలు ముక్కలైపోయాయి. అసలే నీళ్ళ కటకట. మీకిదే చెప్తున్నా వినండి. అవి ఈ యింట్లో ఉండటానికి వీల్లేదు. వాటిని తరిమేయండి. లేదా మనం ఈ యిల్లు వదిలేసి మరో యింటికెళ్ళిపోదాం".

"అవి యింట్లో ఉండటం లేదు కదా. యింటి లెంటిల్స్‌పైన పాపం వాటి మానాన . . ."

ఆమె బుస కొడ్తూ విసవిసా వంట గదిలోకెళ్ళిపోయింది. మామూలు రోజుల్లో ఆమెతోపాటు వంట కార్యక్రమంలో పాలు పంచుకునే నాకు వంట గదిలోకెళ్ళటానికి ధైర్యం చాల్లేదు.

విషయం నిజంగానే సీరియస్ అని అర్థమైంది. పిల్లల్ని పిలిచి మంతనాలు జరిపాను. శిల్ప . . . కృతి. పెద్దమ్మాయి ఏడో తరగతి, చిన్నది ఐదు.

"ఎంత తరిమినా పోవటం లేదు నాన్నా. చప్పట్లతో శబ్దం చేస్తే ఎగిరిపోయి మరలా వస్తున్నాయి. పొడవాటి కర్రకు గుడ్డ చుట్టి తరిమినా లాభం లేదు. అమ్మకు ఈ యిల్లంటే ఇష్టం కదా. వాటికీ ఇష్టమేమో" అంటూ నవ్వింది శిల్ప. తన అద్భుతమైన, అపురూపమైన నవ్వు గదంతా విస్తరిస్తూ . . . మల్లెల దొంతరలు పర్చుకున్నట్లు సువాసనలు వెదజల్లుతూ . . .

"ఇటువైపు రెండున్నాయి. అదుగో అటువైపు మరో రెండున్నాయి. మొన్న వాళ్ళింటికి చుట్టాలు కూడా వచ్చారు. రెండు కొత్త పావురాలు . . ." కృతి తన వెడల్పాటి కళ్ళని మరింత పెద్దవి చేస్తూ చెప్పింది.

"కాటాపల్ట్ కొనుక్కుని రానా? చిన్న చిన్న రాళ్ళు వేసి కొడ్తే అవి భయపడి పారిపోతాయి" అన్నాను.

"వద్దండీ పాపం . . .ఆ రాయి పొరపాటున తగిల్తే చచ్చిపోతాయి" వంట గదిలోంచి బైటికొస్తూ అంది సుశీల.

కోపమూ . . . కరుణా . . . కలనేతలా ఉందామె మొహం.

"మనం బాంబే వెళ్ళినపుడు ఒక చోట . . . పేరు గుర్తుకు రావటం లేదు . . . పావురాళ్ళ కోసం గింజలు కొన్ని చల్లాం. అవి గుంపులుగా వచ్చి తిన్నాయి. చాలామంది అలానే చేశారు. మరి మనం ఎందుకిప్పుడు గింజలు చల్లటం లేదు? ఎందుకు వాటిని తరిమేయాలనుకుంటున్నాం?" అడిగింది కృతి.

సమాధానం చెప్పమన్నట్లు సుశీల వైపు చూసాను. ఆమె రుసరుసలాడ్తూ లోపలికెళ్ళిపోయింది.

* * * * *

ఆ రోజు సాయంత్రం యింటికెళ్ళేప్పటికే యుద్ధ వాతావరణమేదో నిద్ర లేస్తున్నట్లనిపించింది.

తొందరగా ఫ్రెషప్ అయి, లైబ్రరీకెళ్ళి పుస్తకాల్లో తల దాచుకుందామని నా ప్లాన్. లంఖిణిలా అడ్డుపడింది సుశీల.

"మీకెన్నిసార్లు చెప్పాను? ఈ యింట్లో అవైనా ఉండాలి . . . నేనైనా ఉండాలని".

"మరలా ఏమైంది?"

"యింకేం కావాలి? యింతకన్నా దారుణం మరేం జరగాలి?"

"విషయం ఏమిటో చెప్పు"

"ఈ రోజు శిల్ప ఏమడిగిందో తెలుసా?"

"నువ్వు చెప్పకుండా నాకెలా తెలుస్తుంది?"

సుశీల నా వైపు నిరసన చూపొకటి విసిరింది.

"మీరసలు నాతో మాట్లాడకండి. ఏ విషయమైనా, ఎప్పుడైనా సీరియస్‌గా తీసుకున్నారా? జీతం డబ్బులు తెచ్చి నా చేతిలో పడేయటంతోటే మీ బాధ్యత తీరిపోయిందా? పిల్లలు ఎలా ఎదుగుతున్నారో, పరిసరాల ప్రభావం వారి మనస్తత్వంమీద ఎంతటి విషాన్ని చిమ్ముతుందో ఎప్పుడైనా ఆలోచించారా?"

"పరిసరాలకేమైంది? మన చుట్టుపక్కల అందరూ మంచివాళ్ళే ఉన్నారుగా"

"ఆ ముదనష్టపు పావురాళ్ళు చాలదూ? శిల్ప అడిగిన ప్రశ్నకు సిగ్గుతో చితికి పోయానండీ. అవి అస్తమానం ఒకదానికొకటి ఏం చేస్కుంటున్నాయి మమ్మీ అని అడిగింది. ఏం చెప్పాలో తెలీక అవస్థపడ్డాను".

నాకూ కొద్దిసేపు తల తిరిగినట్లయింది.

"ఛీ పాడు. వాటికైనా సమయం, సందర్భం ఉండక్కరలేదా. ఎప్పుడు చూసినా అదే యావ. అసలే ఆడపిల్లలు. పెద్దవాళ్లవుతున్నారు. వాళ్లడిగే ప్రశ్నలకు సమాధానాలు తెలిసీ అబద్ధాలు చెప్పలేను. మనం వెంటనే యిల్లు మారిపోదాం".

"యింత తక్కువ అద్దెకి యింత పెద్ద యిల్లు ఎక్కడ దొరుకుతుంది చెప్పు. యిది నా స్నేహితుడిది కావటం, అతను అమెరికా వెళ్ళటం వల్ల కదా".

"అద్దె తక్కువని నా కూతుళ్ళ కళ్ళబడకూడని విషయాలు ఎదురుగా జరుగుతూ ఉంటే చూస్తూ వూరుకోమంటారా? అలాగయితే వాటిని తరిమేయండి. యిది నా యిల్లు. పవిత్రంగా ఉండాలి".

"కాపురాలు చేయటం అపవిత్రత ఎలా అవుతుంది? పావురాలు కూడా ఒక్కరితోనే జత కలుస్తాయి తెలుసా . . . వాటి సృష్టి ధర్మాన్ని అవి నిర్వర్తిస్తున్నాయి. మనలా అవి కూడా రహస్యంగా, ఎవ్వరి కంటా బడకుండా కల్సుకోవాలంటే వాటికెలా కుదుర్తుంది చెప్పు. అవి స్వేచ్ఛా జీవులు".

"పిల్లలు చెడిపోవడానికి టీవీలు, ఇంటర్నెట్లు దేనికి? మన యిల్లు చాలు. కళ్ళెదురుగా పావురాళ్ళ కామకేళీ విలాసాలు చూసి తరించవచ్చు."

నాకూ తన వాదనలో బలముందనిపించింది. "నీ తెలుగు పాండిత్యం చాల్లే. నన్ను కొంత ఆలోచించనీ, వీటిని ఎలా తరిమేయాలో చెప్తాను" ఆమెను సముదాయిస్తూ అన్నాను.

మరునాడు సాయంత్రం షాపులన్నీ తిరిగి పిల్లలు ఆడుకునే తుపాకీ కొన్నాను. ట్రిగ్గర్ నొక్కగానే పెద్ద శబ్దం వస్తుంది. బెలూన్లు పగులగొట్టటానికి వాడే తూటాల్లాంటి చిన్న ప్లాస్టిక్ తూటాలు కూడా యిచ్చాడు.

దాన్ని ఎలా వాడాలో సుశీలకు వివరంగా చెప్పాను.

"వాటివైపు గురి పెట్టకుండా పక్కకు గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కు. ఆ శబ్దానికే వెళ్ళిపోతాయి. అలా వరసగా రెండు మూడు రోజులు చేస్తే మరలా రావు" అన్నాను.

కాలేజీ వ్యవహారాల్లో మునిగిపోయి వారం వరకూ పావురాళ్ళ విషయమే మర్చిపోయాను. ఆ రోజు యింటికెళ్ళేప్పటికే ఏడు దాటింది.

వాతావరణంలో ఏదో మార్పు – జరక్కూడనిదేదో జరిగినట్లు . . . స్మశాన నిశ్శబ్దం . . .

సుశీల దిగులుకు పర్యాయపదంలా కూచుని ఉంది "ఏం జరిగింది? పిల్లలేమైనా సతాయించారా?" అని అడిగా.

అంతే. చివ్వున లేచి నా గుండెలమీద తల పెట్టుకుని ఏడ్చింది.

విషయం తెలీక కంగారు పడ్డాను. పిల్లల ఆరోగ్యాలు బాగానే ఉన్నాయా అనే అనుమానం – పిల్లల్ని కేకేశాను.

శిల్ప, కృతి వాళ్ళ గదిలోంచి పరుగెత్తుకుంటూ వచ్చారు.

"ఏమైందమ్మా" శిల్పనడిగా.

"ఓ పావురం చచ్చిపోయింది నాన్నా" అంది.

"అమ్మ చంపేసింది . . . తుపాకీతో" అంది కృతి. దాని కళ్ళలో కూడా బాధ సుళ్ళు తిరుగుతూ . . .

"పాపం మిగతా పావురాలు చనిపోయిన పావురంవైపు ఎంత జాలిగా చూశాయో . . . ష్యూర్‌గా ఏడ్చి ఉంటాయి" శిల్ప కళ్ళు చెమ్మగిల్లాయి.

"నేను కావాలని చంపలేదండీ. మీరు చెప్పినట్లే పక్కకు గురిపెట్టి పేల్చాను. ఆ శబ్దానికి పావురాలు ఎగిరాయి. అందులో ఒకటి నేను గురిపెట్టిన వైపుకే ఎగిరింది. కిందపడిపోయింది. బతికించాలని చాలా ప్రయత్నించానండీ. చిన్న ప్లాస్టిక్ తూటానేగా చావదనుకున్నాను. గుండె దగ్గర తగిలినట్లుంది. చచ్చిపోయిందండీ" వెక్కిళ్ళమధ్య చెప్పింది సుశీల.

"పోన్లే జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు కావాలని చంపలేదుగా. టేకిట్ ఈజీ" ఆమెను ఓదార్చే ప్రయత్నం చేశాను.

"మొదట్లో తూటాలు లేకుండానే బెదిరించానండీ. ఆ శబ్దానికవి అలవాటు పడ్డాయి. వాటికీ ఆటలా మారింది. శబ్దం రాగానే టపటపా ఎగిరి మరుక్షణం అక్కడే వాలేవి. తూటాలుంటే భయపడ్తాయనీ . . . వాటిని చంపాలని కాదండీ. దాని జత పావురం నావైపు అదోలా చూసింది తెలుసా . . . ఎన్ని శాపనార్థాలు పెట్టిందో".

ఆ రాత్రి సుశీల అన్నం ముట్టలేదు. పిల్లలు కూడా కంచాల్లో కోడి గెలికినట్లు గెలికి వదిలేశారు.

ఇది జరిగిన మూడ్రోజుల తర్వాత కృతి చెప్పింది. "యిప్పుడు మనకు తుపాకీతో అవసరం లేదు నాన్నా. మిగతా పావురాలు కనిపించటం లేదు. ఎక్కడికో వెళ్ళి పోయాయి".

సుశీలకు ఇంటిచుట్టూ శుభ్రం చేసే బాధ తప్పినందుకు సంతోషపడ్డా. ఆమె మొండితనం నాకు తెలుసు. ఆ పావురాల బెడద వదలకుండా ఉంటే యిల్లు మారేవరకు వూర్కునేది కాదు. తక్కువ అద్దెకు దొరికిన ఈ యిల్లు మారాల్సిన అవసరం తప్పిపోయినందుకు కూడా సంతోషపడ్డా.

కానీ సుశీలలో సంతోషం మచ్చుకైనా కనిపించలేదు. ఎపుడు చూసినా విషణ్ణ వదనమే.

"పాపం పిచ్చివండీ పావురాళ్ళు . . . వాటి కోసం ఎప్పుడూ ఓ గింజ విదల్చకున్నా మన యింటి చూరు పట్టుకుని వదిలేవి కావు. అదిలించినా బెదిరించినా అలగకుండా ఆశ్రయం కోరిన వాటిని అమానుషంగా తరిమేశానండీ" అంది.

పట్టుమని పదిరోజులు కాకుండానే "నాకు పిచ్చి పట్టేట్టుందండీ" అంది.

"మరలా ఏమైంది? పావురాళ్ళు తిరిగొచ్చాయా?"

"వచ్చినా బావుండు. వాటి అల్లరీ, కువకువలూ . . . గుర్తొస్తున్నాయి. వాటి గుసగుసల్లాంటి శబ్దాలు అలవాటై యిప్పుడేం తోచటం లేదండీ. మీరు ఆఫీస్‌కి, పిల్లలు స్కూళ్ళకి వెళ్ళాక యిల్లంతా నిశ్శబ్దంగా ఉండి భయమేస్తోంది. పావురాళ్ళున్నప్పుడే నయం, నాకొంత కాలక్షేపమయ్యేది".

ఓ రోజు సాయంత్రం యింటికెళ్ళేప్పటికి శిల్ప, కృతి మిద్దెమీద నిలబడి జొన్నల్ని చల్లుతున్నారు.

"ఏం చేస్తున్నారు" అని అడిగా.

"పావురాళ్ళని పిలుస్తున్నాం. అమ్మ చల్లమంది" అంది కృతి.

**(ఆదివారం వార్త - 15 మే, 2005)**